క్లుప్తంగా

శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు



బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : జోగుంపేట ఎస్సీ శ్మశాన వాటికలో సర్పంచ్ జువ్వల లక్ష్మి ఆధ్వర్యంలో చేతిపంపు బోరును గురువారం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు బోరు నిర్మాణం కోసం జెడ్పీపీటీసీ నిధుల నుంచి మంజూరు చేయడంతో ఈ పనులు చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. శ్మశాన వాటికిలో బోరు ఏర్పాటు చేయడం వల్ల అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గొలుగొండ మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు చిట్ల చలపతిరావు, గొలుగొండ సర్పంచ్ కసిపల్లి బుజ్జితో పాటు స్థానిక నాయకులు జువ్వల దేముడు పాల్గొన్నారు.

గొలుగొండలో మోస్తరు వర్షం

గొలుగొండ : మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు వర్షం కురవడంతో వరి నారుమడులకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే నువ్వు పంట వేసిన రైతులకు ఈ వర్షం వల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయని పంట వేసిన రైతులు తెలుపుతున్నారు. వర్షం కారణంగా జోగుంపేటలో జరిగే గురువారం వరపు సంత వెలవెలబోయింది.

జలాశయాల్లో పెరుగుతున్న నీటి మట్టం

మాడుగుల రూరల్ : గత ఐదు రోజులుగా ఆడపా దడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని జలాశయాల్లో నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. జాలంపల్లి వద్ద పెద్దేరు జలాశయంలో నీటిమట్టం పెరుగుతుంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, గురువారం నాటికి 136.30 మీటర్లకు చేరింది. కురుస్తున్న వర్షాలకు జలాశయంలో 243 క్యూసెక్కులు నీరు చేరుతుందని, జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జలాశయం గేట్లు ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తారకరామ జలాశయంలో నీటి మట్టం గణనీయంగా పెరుగుతుంది.

నేడు వాసవీమాతకు పసుపు కొమ్ములతో అర్చన

కె.కోటపాడు :కె.కోటపాడులో గల వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం 100 కిలోల పసుపు కొమ్ములతో అర్చన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా పసుపు కొమ్ములతో అర్చన చేపడుతున్నట్టు అర్చకులు గోరుగుంతు రమేష్‌బాబు పేర్కొన్నారు. ఈ పసుపు కొమ్ములతో అర్చన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

సమస్యల గుర్తింపులో కచ్చితత్వం పాటించాలి



సీఆర్పీలతో సమావేశమైన ఎంఈవో-2 శెట్టి మోహన్

రోలుగుంట : పాఠశాలల సందర్శన, సమస్యల గుర్తింపులో కచ్చితత్వం పాటించాలని సీఆర్పీలను ఎంఈవో- 2 శెట్టి మోహన్ ఆదేశించారు. ఎంఈవో-2 గా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా గురువారం ఎమ్మార్సీ భవన్‌లో గురువారం సీఆర్పీలతో సమావేశమయ్యారు. స్కూలు కాంప్లెక్సుల వారీగా సీఆర్పీలతో వారి పరిధిలో గల పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పాఠశాలలో శిధిల గదులుంటే వెంటనే పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ద్వారా తీర్మానం చేయించాలన్నారు. సీఆర్పీలు సతీష్, సూర్యి, చిరంజీవి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి రమణయ్య జయంతి



అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈవో-2 మోహన్, హెచ్ఎం శేషగిరి

రోలుగుంట : స్థానిక గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి రమణయ్య జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఈవో-2 శెట్టి మోహన్, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.వి.శేషగిరిరావు, సీఆర్పీలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమం ప్రాముఖ్యత గురించి హెచ్ఎం శేషగిరిరావు మాట్లాడారు. ఒక పుస్తకం వెయ్యిమంది స్నేహితులతో సమానమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శర్మ, సీఆర్పీలు సతీష్, చిరంజీవి పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన కె.జె.పురం పశువైద్య పర్యవేక్షణ కేంద్రం



కింతలి పశువైద్యశాలను పరిశీలిస్తున్న ఎంపీపీ రాజారాం (ఫైల్)




కె.జె.పురం పశువైద్యశాలలో దెబ్బతిన్న గచ్చులు

శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు

- మాడుగుల మండలంలో పశువైద్య కేంద్రాలు : 3
- గ్రామీణ పశువైద్యకేంద్రాలు : 1
- మండలంలో పశుసంపద గొర్రెలు మేకలు, కోళ్ల సంఖ్య

ఆవులు : 10,700, గేదెలు : 9846, మేకలు : 4461, గొర్రెలు : 8825, పౌల్ట్రీ(కోళ్లు) : 74,610

- కూలడానికి సిద్ధంగా జె.డి.పేట గ్రామీణ పశువైద్యశాల
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పక్కా భవనాలు నిర్మించాలని కోరుతున్న రైతులు



శ్లాబ్ పూర్తిగా శిథిలమైన జె.డి.పేట గ్రామీణ పశువైద్యశాల భవనం

మాడుగుల రూరల్ : మాడుగుల మండలంలో గల పశువైద్య పర్యవేక్ష కేంద్రాలు, గ్రామీణ పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరాయి. శ్లాబ్‌లు పూర్తిగా శిథిలమై వర్షం వస్తే పూర్తిగా కారిపోతున్నాయి. దీంతో ఆస్పత్రిలో గల రికార్డులు, మందులు, దాణా, ఇతర కంప్యూటర్ పరికరాలు తడిసి ముద్దవుతున్నాయి. మండలంలో కె.జె.పురం పశువైద్యశాల 1987లో గ్రామములో పాలసొసైటీ పక్కన నిర్మించారు. గచ్చు శిథిలమవడంతో సుమారు పదేళ్ల క్రితం భవనానికి మరమ్మతులు చేపట్టారు. అయినా సరే గచ్చులు పూర్తిగా పెచ్చులుడాయి. శ్లాబ్ కూడా దెబ్బతింది. దీంతో వర్షం వస్తే వైద్యాధికారి గది, మందులు స్టాక్ రూమ్ పూర్తిగా కారిపోతుంది మందులు, పశుగ్రాస విత్తనాలు, తడిసిపోతున్నాయి. ఆస్పత్రి ఆవరణ అంతా తుప్పలు డొంకలతో నిండిపోయింది.

కూలడానికి సిద్ధంగా ఉన్న జేడీపేట గ్రామీణ పశువైద్యశాల

జె.డి.పేటలో గ్రామీణ పశువైద్య కేంద్రం 1969లో ఏర్పాటు చేశారు. 1997లో అప్పటి ఎమ్మెల్యే రెడ్డి సత్యనారాయణ హయాంలో రూ.60 వేల వ్యయంతో చిన్న గదిని నిర్మించారు. పిడుగు పడితే భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి కింద వున్న వారి నెత్తి మీద పడుతున్నాయి. వర్షం వస్తే వారం రోజుల పాటు వర్షపు నీరు కిందికి చిమ్ముతుంది. దీంతో రికార్డులు, మందులు, విత్తనాలు, తడిసి ముద్దవుతున్నాయి. ఇక్కడ గతంలో పలువురు రైతులు ఈ భవనం మరమ్మతులు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కొత్త భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపించారు. అయితే కార్యరూపం దాల్చలేదు.

కింతలి వల్లాపురం పశువైద్య కేంద్రం 6 పంచాయతీలకు పశువైద్యం అందిస్తుంది. పశువైద్యశాలకు చెందిన కిటికీలు, తలుపులు పూర్తిగా పోయాయి. దీనివల్ల పశువైద్యశాలల్లో విలువైన మినరల్ మిక్చర్, తాళ్లు, బూట్లు దొంగలు అపహరించారు. తలుపులు, కిటికీలు లేకపోవడం వల్ల డోర్ కర్టెన్లు ఏర్పాటు చేసుకున్నారు. గతంలో ఆస్పత్రిని ఎంపీపీ రాజారామ్ పరిశీలించి, కొత్త ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆస్పత్రికి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



పూర్తి శిథిలావస్థలో జేడీపేట గ్రామీణ పశువైద్యశాల భవనం



కింతలి వల్లాపురం పశువైద్యశాలలో కిటికీల స్థానంలో అమర్చిన పెట్టె

కొత్త భవనానికి నిధులివ్వాలి



జె.డి.పేట గ్రామీణ పశువైద్య కేంద్రం భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరింది. కనీసం సిబ్బంది విధులు నిర్వహించడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. మందులు, రికార్డులు, పశుగ్రాస విత్తనాలు తడిసిపోతున్నాయి. వర్షపు నీరు శ్లాబ్ మీద నుంచి కిందికి పారుతుంది. పూర్తి స్థాయిలో పక్కా భవనం నిర్మించాలి

–పి.రాజుబాబు, రైతు, ఎం. కోటపాడు

మరమ్మతులు చేపట్టాలి



కె.జె.పురం పశువైద్య పర్యవేక్షక కేంద్రానికి మరమ్మతులు చేపట్టాలి. శ్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే మొత్తం భవనం కారిపోతుంది. కంప్యూటర్ తదితర వస్తువులు ఒక గదిలో ఉంచుతున్నారు. మరమ్మతులతో పాటు ఆస్పత్రి ఆవరణ అంతా మట్టితో ఎత్తు చేయించాలి.

–బి.జగ్గప్పారావు, రైతు, కె.జె.పురం గ్రామం, మాడుగుల మండలం

శ్రావణ పూజలకు సిద్ధమవుతున్న దేవీ ఆలయాలు



మాడుగుల మోదకొండమ్మను ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

మాడుగుల : ఈ నెల 25 వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంబమవడంతో మాడుగుల మోద కొండమ్మ,, మాడుగుల, జంపెన వాసవీమాత, సంతోషిమాత ఆలయాలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది శ్రావణమాసం ప్రారంభంలోనే తొలి శుక్రవారం కావడంతో వరలక్ష్మీదేవి వ్రతాలు ప్రారంభం కావడం విశేషం. హిందువులకు అత్యంత ముఖ్యమైన శ్రావణమాసంలో వరలక్ష్మీదేవి పూజలతో పాటు రాఖీ పూర్ణిమ, శ్రీకృష్ణాష్టమి పండగలు జరుపుకొంటారు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవక రైతులు ఖరీఫ్ పంటలు ప్రారంభించ ఇబ్బందుల్లో ఉన్నారు. దీంతో మార్కెట్లలో పండ్లు, దుకాణాలతో పాటు బంగారు దుకాణాల్లో సందడి కనిపించడం లేదు.

రోడ్డు మధ్య గోతులను పూడ్చిన పోలీసులు



దిబ్బిడి వద్ద రోడ్డు గోతులను కప్పిస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట మండలంలో గల కొంకోట,బంగారుమెట్ట రోడ్డులో రోడ్డు మధ్యన ఏర్పడ్డ గోతులను పోలీసులు కప్పించారు. కేబీ రోడ్డులో దిబ్బిడి వైస్ ఎంపీపీ గొంపా చినబాబు ఇంటి వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వేగంగా వస్తున్న పలువురు వాహనదారులు ఈ గోతిలో పడి ప్రమాదాలకు గురౌవుతున్నారు. గురువారం సాయంత్రం ఎస్ఐ శ్రీనివాసరావు, అదనపు ఎస్ఐ భాస్కరరావు చొరవ చూపి కేబీ రోడ్డులో ఏర్పడ్డ గోతులను పిక్క, రాయి బుగ్గితో కప్పించారు.

నాసిరకం విత్తనాలతో మోసపోయిన సర్పంచ్

- రైతు సేవా కేంద్రంలో మూడు బస్తాల విత్తనాలు కొనుగోలు
- 15 రోజులు దాటినా మొలకెత్తకపోవడంపై ఆవేదన



కేపీ అగ్రహారంలో సరిగా మొలకెత్తని సర్పంచ్‌కు చెందిన ఆకుమడి



సర్పంచ్ కొనుగోలు చేసిన ఆర్‌జీఎల్ రకం వరి ధాన్యం గోనెలు

బుచ్చెయ్యపేట : నాసిరకం వరి విత్తనాలతో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీను తన గ్రామ రైతు సేవా కేంద్రంలో ఆర్‌జీఎల్ 2537 రకం మూడు బస్తాల వరి విత్తనాలను 20 రోజుల కిందట రూ. 3వేలకు కొనుగోలు చేశారు. తన పొలంలో దమ్ము చేసి వరి విత్తనాలు వేశారు. విత్తనాలు వేసి 15 రోజులు దాటిన వరి విత్తనాలు సరిగా నాటలేదు. మూడు బస్తాలు వేయగా ఒక బస్తాకి తగ్గ ఆకు మాత్రమే నాటిందని ఆయన వాపోయారు. నాసిరకం వరి విత్తనాలను ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేశారని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసిన వరి విత్తనాల బస్తాలను రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బంది మొలక శాతంను పరీక్షించకుండా నేరుగా రైతులకు అమ్మకాలు చేశారన్నారు. ఇప్పటికే వర్షాలు సరిగా లేక వరి ఆకుపోతలు ఆలస్యంగా వేశామని ఇపుడు నాసిరకం వరి విత్తనాల వల్ల వరి ఆకు నాటక తీవ్రంగా నష్టపోయానన్నారు. ఏడాది తిండి గింజలు ఆరంభంలోనే దక్కని పరిస్థితి ఏర్పడిందన్నారు. తన లాగే గ్రామంలో రైతుల ఆకుమడులు సరిగా నాటడం లేదని, ప్రభుత్వం నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుని నష్ట పరిహారం అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ నర్సీపట్నం ఈఈ ఏఈఎస్ఎం అప్పారావు తెలిపారు. నర్సీపట్నం డివిజన్ రోలుగుంట సెక్షన్ 33/11 కేవీ రోలుగుంట ఫీడర్‌లో ఆర్.డి.ఎస్.ఎస్ వర్క్‌లో భాగంగా బొడ్డేపల్లి నుంచి రోలుగుంట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. రోలుగుంట, కొమరవోలు, కొంతలం, కె.నాయుడుపాలెం, చెట్టుపల్లి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

కె.కోటపాడు : మండలంలో కింతాడ ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలగనున్నట్టు కె.కోటపాడు ఎలక్ట్రికల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కింతాడ, జోగన్నపాలెం, గొల్లలపాలెం, ఆర్లి, కె.సంతపాలెం, చంద్రయ్యపేట, గొంపవానిపాలెం గ్రామాల్లో విద్యుత్ ఉండదని చంద్రశేఖర్ తెలిపారు.

చదువుతోనే ఉత్తమ భవిష్యత్తు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : చెడు అలవాట్లకు బానిసలైపోకుండా కష్టపడి చదువుకుంటే కీర్తి ప్రతిష్టలొస్తాయని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. మండంలో వేములపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఫోక్సో చట్టం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, రోడ్డు ప్రమాదాల నివారణ, శక్తి యాప్ ప్రయోజనాలపై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత కోసం పోక్సో చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. బలవంతంగా బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల నుంచి సమాజాన్ని పూర్తిగా విముక్తి చేయడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. శక్తి యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐ రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో గొయ్యితో ప్రమాదాలు



రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి వల్ల ప్రమాదం జరగకుండా హెచ్చరికగా కర్ర పాతిన దృశ్యం

నర్సీపట్నం : నర్సీపట్నం నుంచి తుని వెళ్లే ప్రధాన రోడ్డుకు అగ్నిమాక కేంద్రం సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వాహనదారులు ఈ గొయ్యను దాటాలంటే భయంతో వణికిపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూడ్చిన గుంతల్లో ఇదొకటి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు యథావిధంగా గుంత తయారైంది. వర్షం పడినప్పుడు వర్షం నీరు గుంతలో చేరడంతో గుంత కనిపించక వాహనదారులు అందులో పల్టీ కొడుతున్నారు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అర్అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదని అక్కడ వారు చెబుతున్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు చుట్టు పక్కల వారు గుంతలో కర్రపాతి ఎరుపురంగు సంచి తగిలించారు. వాహనదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని గుంతను పూడ్చాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

కోలాటం మహిళలకు ఏకరూపు చీరల వితరణ



మహిళలకు వైస్ ఎంపీపీ సూర్యనారాయణ చేతుల మీదుగా చీరలు అందజేసిన గోవిందరావు

కె.కోటపాడు : గ్రామాల్లో పండగలు ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ సమయాల్లో భక్తిభావంతో మహిళలు కోలాటం నిర్వహిస్తుండడం అభినందనీయమని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ అన్నారు. మల్లంపాలెం గ్రామంలో కోలాటం ప్రదర్శన ఇస్తున్న 17 మంది మహిళలకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వార్డు సభ్యుడు వంటాకు గోవిందరావు తన సొంత నగదు రూ.11వేలతో బుధవారం రాత్రి ఏకరూపు చీరలను సమకూర్చారు. వీటిని వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ చేతుల మీదుగా గోవిందరావు అందించారు. ఆయనను వైస్ ఎంపీపీ అభినందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ బొడ్డు లక్ష్మి దేముడుబాబు, జాగరపు కన్నంనాయుడు, రొంగలి గణేష్, వంటాకు నాగరాజు, వంటాకు అప్పారావు, వంటాకు చిన నాయుడు పాల్గొన్నారు.

'ప్రతి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ జెండావిష్కరణలు చేయాలి'



సీతయ్యపేటలో ఎంఆర్‌పీఎస్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

బుచ్చెయ్యపేట : ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పి.వెంకటరావు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం సీతయ్యపేట గ్రామంలో ఎంఆర్‌పీఎస్ సంఘ నాయకుల సమీక్ష సమావేశం జరిగింది. గ్రామంలో ర్యాలీ నిర్వహించి జెండా ఆవిష్కణ చేశారు. అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులంతా సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కలిసి రావాలని కోరారు. జిల్లా, మండల, గ్రామ కమి టీలు వేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎంఆర్‌పీఎస్ నాయకులను సత్కరించారు. ఏలుసూరి ఘాటీలు మాదిగ, ముత్యాలరావు, కె.వెంకటరావు,ఈశ్వరరావు,మేరి, శ్రీనివాసరావు,రమణ పాల్గొన్నారు.

రెండో రోజూ క్వారీ బాధితుల నిరాహార దీక్షలు



నిరాహారదీక్ష చేస్తున్న క్వారీ బాధితులు, ప్రజాసంఘాల నాయకులు

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.కోడూరు సర్వే నెంబరు 332లో కొనసాగుతున్న నల్లరాయి క్వారీని రద్దు చేయాలంటూ దళిత రైతులు, ప్రజాసంఘాలు ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహారదీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరాయి. వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు మట్ల చంటిబాబు, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బొట్టా నాగరాజు, ఓబీసీ జిల్లా నాయకులు బొంతు రమణ, సామాజిక కార్యకర్త కె.శివనారాయణరాజు, కె.వి.పి.ఎస్ నాయకులు చిరంజీవి మాట్లాడుతూ క్వారీ నిర్వహణ వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నందున తక్షణమే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్వారీ అనుమతులు మంజూరులో పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించారన్నారు. భవిష్యత్తులో కూడా క్వారీ నిర్వహణకు అనుమతులు ఇవ్వబోమని హామీ ఇవ్వాలన్నారు. అనుమతులు రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. దీక్షల్లో బాధిత సాగుదారుల సంఘం నాయకులు అప్పారావు, లోవరాజు, పెంటయ్య, గణేష్, సతీష్, రమణ పాల్గొన్నారు.

మర్రివలసలో ఉచిత కంటి వైద్య శిబిరం



మర్రివలసలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ సిబ్బంది

కె.కోటపాడు : కంటి సమస్యలకు ప్రారంభ దశలోనే మెరుగైన వైద్యం పొందాల్సిన అవసరం ఉందని సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతి అన్నారు. సంఘమిత్ర ఆధ్వర్యంలో గురువారం మర్రివలస గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన 151 మందికి కంటి స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించి ఉచితంగా జరిపారు. వీరిలో 15 మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించేందుకు ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరో 20 మందికి కంటి అద్దాలు సమకూర్చనున్నట్టు ఆస్పత్రి కోఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు. ఆప్టోమెట్రిస్ట్ సాయి, ఫీల్డ్ అసిస్టెంట్ సంతోషి, భూపతి, యశ్వత్, గీతాశ్రీ పాల్గొన్నారు.

వరి నారుమడిలో జింక్ లోపం



మార్టూరులో పరిశీలిస్తున్న ఏవో రంగాచారి

అనకాపల్లి: వరి నారుమడిలో జింక్ లోపం వచ్చే అవకాశం ఉందని, జింక్ సల్ఫేట్ ఐదు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.బి.రంగాచారి తెలిపారు. సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు ఆధ్వర్యంలో మార్టూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసానికి యూరియా వాడటం వల్ల పశువులు, మనుషులు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. పొలాన్ని దమ్ము చేసేటప్పుడు ఒక బస్తా డీఏపీ, 20 కేజీలు పొటాష్ ఎయం వేసినట్లయితే వరి దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రావణి, జోత్స్న పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్యం తీరును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్: ప్రజలందరూ తడి, పొడి చెత్త వేర్వేరుగా అందివ్వాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి సూచించారు. పట్టణంలోని 83వ వార్డులో శానిటేషన్ పనుల తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. అప్పారావు, కార్యదర్శి జి. మోహిని, సూపర్‌వైజర్ వి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.